## క్లుప్తంగా

### కొత్తూరులో డీఎంహెచ్ఓ పూజలు



డీఎంహెచ్ఓకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నంద్యాల జిల్లా డీఎం అండ్‌హెచ్ఓ వెంకటరమణ పూజలు నిర్వహించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ఆలయంలో నూతనంగా నిర్మించిన మహాప్రాకారం, విడిది గదులు పరిశీలించారు. ఆలయ చరిత్రను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎంల పనితీరుపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని సచివాలయం-3 పరిధిలో ఓటర్లకు ఈవీఎంల ఉపయోగం, పనితీరుపై తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటు ఎలా వేయాలి, ఏ బటన్ నొక్కాలి, ఎలాంటి సూచనలు పాటించాలనే విషయాలను వివరించారు.

### భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ

గడివేముల: భూమి లేని నిరుపేదలకు, ప్రభుత్వ భూమిలో అనుభవంలో ఉన్నవారికి భూ పంపిణీ చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలోని ప్రభుత్వం భూమి అనుభవంలో ఉన్న వారికి సంపూర్ణ హక్కులు కల్పించేందుకు భూ సర్వే చేస్తున్నామన్నారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ప్రభుత్వ భూ సర్వే జరుగుతుందని తెలిపారు. పొలాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలతో హాజరు కావాలన్నారు. అనుభవంలో ఉన్నవారికి అసైన్‌మెంట్ కమిటీ నిర్వహించి త్వరలో భూ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కొర్రపోలూరు గ్రామంలోని సర్వే నంబర్లు 1, 11, 12, 30, 149, 184, 365, 427, 428, 429, 430, 432, 433 నుంచి 457 వరకు అనుభవంలో ఉన్న వారందరూ హాజరు కావాలన్నారు. అలాగే 462, 470, 475, 478, 480, 481 తదితర సర్వే నెంబర్లకు సంబంధించిన రైతులు భూ సర్వేకు సహకరించాలని కోరారు. గ్రామంలోని సచివాలయం వద్ద ఇప్పటికే నోటీసు అతికించినట్లు తెలిపారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

గూడూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురువ వెంకటేష్ (65) కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ పీరా తెలిపారు. మంగళవారం పట్టణ సమీపంలో ఆటో-బైక్ ఢీకొన్న ప్రమాదంలో అల్వాల గ్రామస్తులు నలుగురు గాయపడ్డారు. వారిలో తీవ్రంగా గాయపడిన కురువ వెంకటేష్ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదానికి కారణమైన బైకిస్టు జి.గోపాల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



ఒండుట్లలో బడి బయట విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

పాణ్యం: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని నంద్యాల జిల్లా నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయాల్లో ఇది చరిత్రాత్మకమైనదన్నారు. ప్రస్తుతం బడి బయట ఉండే పిల్లలు ఇంకా ఎవరైనా ఉంటే గుర్తించాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి, బడిఈడు పిల్లలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని బిలకల గూడూరు గ్రామ సచివాలయంలో ఎంఈఓ మేరీ సునీత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోపై సమావేశం నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లల ఇంటి వద్దకు వెళ్లి తల్లి దండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు.

# అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుద్దాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- రాజ్యాంగ నిర్మాతకు నివాళి



శరీన్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేల ప్రభుత్వంలో భాగస్వాములను చేశారన్నారు. స్థానిక, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం పదవులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జయరాముడు, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహులు, శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, నాయకులు నాగమద్దిలేటి, తిరుమలేష్‌గౌడ్, హుసేన్ ఆలం తదితరులు పాల్గొన్నారు.

**అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం**

కర్నూలు (న్యూటౌన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు పిలుపునిచ్చారు. బుధవారం ఎరుకల హక్కుల పోరాట సమితి కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కటారి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జీ ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవి శంకర్‌గౌడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఓర్వకల్లు : అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని నవ్యాంధ్ర విద్యార్థి యువజన సమాఖ్య జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్, బీఎస్పీ మండల కార్యదర్శి మునిస్వామి అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళితసంఘం నాయకులు జెల్లి కృష్ణ, కురువ స్వాములు, రెడ్డిపోగు సంజీవ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని ఎంపీడీఓ రాముడు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ ఆలీపీరా, సిబ్బంది పాల్గొన్నారు.







అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎరుకల హక్కుల పోరాటసమితి నాయకులు, ఓర్వకల్లులో.. నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు,



గూడూరులో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేస్తున్న అధికారులు

### ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ

కల్లూరు: ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఎస్ఐ గది, రిసెప్షన్, రైటర్, కంప్యూటర్ ఆపరేటర్, లాకప్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లలో స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రికార్డులు, రిజిస్టర్లు, స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ డీఎస్పీ పి.భావన, కర్నూలు రూరల్ సీఐ వి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం : తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. అలాగే సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు.

## మాతా శిశువుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: ప్రభుత్వం మాత శిశువుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగా మాత శిశు సేవలు బలోపేతం చేయడానికి ''కిల్కారి మెసేజ్ విధానం' ప్రారంభించినట్లు జిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గ్రామ సచివాలయం-1 పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు 4వ మాసం నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒక సారి 01244588000 నంబర్ నుంచి వాయిస్ మెసేజ్ వస్తుందన్నారు. వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు గురించి తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ కేంద్రంలో రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు రఘు, నవీన్, డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ విజయ్ కుమార్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర'



గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు : గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహిస్తోందని, ఇందుకు క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 21 వరకు వాలీబాల్, కబడీ, ఖో-ఖో, క్రికెట్, బాడ్మింటన్ పోటీలను జరుగుతాయని చెప్పారు. 15సంవత్సరాలు పైబడిన క్రీడాకారులందరూ గ్రామ సచివాలయంలో రిజిష్టర్ చేసుకోవాలని కోరారు.

**సద్వినియోగం చేసుకోండి**

సి.బెళగల్: ఈనెల 15 నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను మండలంలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. 15 నుంచి 60 సంవత్సరాలు వయస్సు ఉండి, క్రీడలపై ఆసక్తి కలిగిన యువతీ, యువకులు, ప్రజలు ఆడుదాం ఆంధ్ర వెబ్‌సైట్‌లో లేదా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## జగనన్నతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



పంచలింగాలలో వలంటీరలకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్



ప్యాలకుర్తిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉప్పలపాడులో సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేస్తున్న పార్టి నాయకులు

కర్నూలు సిటీ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం పంచలింగాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలతో జగనన్న ముందుకు సాగుతున్నారన్నారు. ఎన్నికల్లోని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అవినీతికి తావు లేకుండా అమలు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నెహిమియా, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

కోడుమూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని ఎంపీటీసీ సందప్ప అన్నారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సచివాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, స్థానిక నాయకులు మధుమోహన్‌రెడ్డి, నాయకులు రవి, మునాఫ్, ఉసేన్, సులేమాన్ పాల్గొన్నారు.

**జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి**

ఓర్వకల్లు : పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు రావాలి' కార్యక్రమం నిర్వహించారు.ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు పుల్లయ్య పాల్గొన్నారు.



21వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

కల్లూరు: రాష్ట్రంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 21వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి' - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణ, బాల చంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి

కర్నూలు (న్యూటౌన్): వినియోగదారుల హక్కులను కాపాడి మోసాలను అరికట్టాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమెనిటీస్ సెక్రటరీలకు వివిధ అంశాలకు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతలు ఉపయోగించే వ్యాపార సంస్థలు, ప్యాకేజ్ చేయబడిన వస్తువులను విక్రయించే వ్యాపార సంస్థలను ఎన్ఐసీ అభివృద్ధి చేస్తున్న యాప్ సహాయంతో నమోదు చేయాలని సూచించారు. ధ్రువీకరించని, ప్రామాణికం కాని తూనికలు, కొలతలు ఉపయోగించడం, సరుకులను నిర్దిష్ట ప్రమాణం కంటే తక్కువగా సరఫరా చేయడం, ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా ప్యాకేజీలను విక్రయించడం వంటి విషయాలపై ఫిర్యాదులను స్వీకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వైద్య విద్యాబోధనపై వర్క్‌షాప్

కర్నూలు(హాస్పిటల్): ఎంబీబీఎస్ ఫైనలియర్ వైద్య విద్యార్థులకు ఎలా బోధించాలనే విషయమై కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో రెండురోజులుగా జరుగుతున్న కరిక్యులమ్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్ అనే వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ చలం టీచింగ్ ఎయిడ్స్‌ను అందించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఒకే వైద్య విద్య ఉండే విధంగా ఫైనలియర్ విద్యార్థులకు ఎలాంటి బోధన చేయాలనే దానిపై రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ సింథియా, డాక్టర్ జయరామ్, డాక్టర్ రేణుకాదేవి టీచింగ్ మాడ్యుల్స్ ద్వారా వివరించారు. విద్యార్థులకు ఏ క్లాసును ఎలా బోధించాలనే విషయమై వారు సవివరంగా పేర్కొన్నారు. డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ శారద, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రిజర్వేషన్లలో సమన్యాయం కోసం చలో ఢిల్లీ

- ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ



పోస్టర్లను విడుదల చేస్తున్న దండు వీరయ్యమాదిగ

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల భావితరాల కోసం రిజర్వేషన్లలో సమన్యాయం కోరుతూ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ చెప్పారు. బుధవారం డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని ఆయన విగ్రహం ఎదుట ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ నివేదిక ఆధారంగా చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ డిమాండ్ సాధనకు ఈ నెల 13, 14వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాదిగ కురుక్షేత్ర సంగ్రామ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో కమిటీ పేరుతో ఎస్సీ వర్గీకరణ కాలయాపన చేయడమే గాకుండా రెండు రాష్ట్రాల మాదిగల ఐక్యతను దెబ్బ తీసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు పెద్ద సంఖ్యలో కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆంజనేయమాదిగ, గోపి మాదిగ, రాజు, ప్రతాప్‌మాదిగ, విహార్, సోల్మన్ తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీ నదిని పరిరక్షించుకుందాం





చర్చాగోష్టిలో పాల్గొన్న వారితో ప్రముఖ భూగర్భ జలాల నిపుణులు ముచ్చకోట చంద్రశేఖర్, తదితరులు

కర్నూలు సిటీ: తాగు, సాగు నీరు అందించే హంద్రీనదిని పరిరక్షించుకుందామ ప్రముఖ భూగర్భ జలాల నిపుణులు, విశ్రాంత ఉపసంచాలకులు ముచ్చకోట చంద్రశేఖర్ అన్నారు. హంద్రీనది దినోత్సవం సందర్భంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి కిసాన్ ఘాట్‌లో హంద్రీనది పరిరక్షణపై సామాజిక వేత్త చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన మంగళ, బుధవారాల్లో చర్చాగోష్టి నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. హంద్రీలో ప్రవహించే నీరు ఒకప్పుడు చాలా తక్కువ లవణశాతం కలిగి ఉండేదన్నారు. కానీ నేడు నదిలో ఎక్కడ చూసినా మురుగునీరు చేరి అపరిశుభ్రంగా తయారు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సామాజికవేత్త చంద్రశేఖర్ కల్కూర, ఏకానమిస్ట్ ఆచార్య మన్సూర్ రెహ్మాన్ మాట్లాడుతూ కర్నూలు పట్టణం ఒకప్పుడు నదికి ఒక వైపు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం తుంగభద్ర, హంద్రీనదుల మధ్య నగరం విస్తరించిందన్నారు. దీని కారణంగానే నది దురాక్రమణలకు గురై తరచూ నగరం వరదలకు కారణమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు నదుల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఓ నివేదికను సైతం అధికార యంత్రాంగానికి అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో హంద్రీనది పరిరక్షణ ఉద్యమకారులు రాజా గోపాల్ రెడ్డి, ఎస్.ఆర్.కె శర్మ, ముచ్చుకోట విజయకుమారి, ఎలమంచి రామయ్య, చరిత్రకారులు ఇమ్మానియేలు, సుధాకర్ గౌడ్, ప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహానటి సావిత్రి జయంతి

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు, కవులు మాట్లాడుతూ మహానటి సావిత్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య, ప్రధాన కార్యదర్శి పి.హనుమంత రావు చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫి, సభ్యులు రోషన్ అలీ, అజయ్‌కుమార్, పుల్లయ్య, అరుణకుమారి, రమణాచారి, ముంతాజ్ బేగం, సంయక్‌కుమార్, శారద, రాఘవేంద్రాచారి, షేక్షావలి, పార్వతయ్య, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సావిత్రి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులు, లస్కర్ వెంకటేష్ బుధవారం రెండు ట్రాక్టర్ల ద్వారా గంజిహళ్లి నుంచి ఎమ్మిగనూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

## రేపు జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 8 వ తేదీ స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30 వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 93984 01721 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



గొల్లలదొడ్డిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: గ్రామాలలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని మండల అధికారులు హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ శేషఫణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్ఐ మన్మథవిజయ్, ఈఓఆర్డీ సందీప్ తదితరులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, ఆస్తులను ప్రజలందరూ పరిరక్షించుకోవాలని, ఎలాంటి అనుమతులు, ఉత్తర్వులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరివెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో లింగేష్, పోలీస్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు ఉన్నారు.